సాక్షి చిత్తూరు

గురువారం । 26 । అక్టోబర్ । 2023



సత్సంబంధాలతోనే మనుగడ

జనంతో సత్సంబంధాలు కొనసాగిస్తేనే పోస్టాఫీసుల మనుగడ ఉంటుందని కర్నూలు రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ అన్నారు. - 8లో



పకడ్బందీగా ఇంటింటి సర్వే

చిత్తూరు జిల్లాలో పాడిరైతుల ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	22
తిరుపతి	36	23
తిరుమల	31	17
గూడూరు	36	24
నగరి	36	23

న్యూస్‌రీల్

హాజరు వేయని టీచర్లకు నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నైషన్) వేయని టీచర్లకు నోటీసులు ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే పలు మండలాల్లో టీచర్లు హాజరు నమోదు చేయకుండా అలసత్వం వహిస్తున్నారు. దసరా సెలవుల అనంతరం బుధవారం బడులు పునఃప్రారంభం అయ్యాయి. జిల్లాలోని 31 మండలాల్లో టీచర్ల హాజరు వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారులు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 8,480 మంది టీచర్లు విధులు నిర్వహిస్తుండగా, 8,266 మంది హాజరు నమోదు చేశారు. మిగిలిన 214 మంది హాజరు నమోదు చేయలేదని అధికారులు గుర్తించారు. చిత్తూరు, కార్వేటినగరం, పుంగనూరు మండలాల్లో టీచర్లు ఎక్కువగా హాజరు నమోదు చేయలేదని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. వంద శాతం హాజరు నమోదైన మొదటి మూడు మండలాల్లో చౌడేపల్లె, గుడిపాల, నింద్ర ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ నెల 25వ తేదీన అటెండెన్స్ వేయని 214 మంది టీచర్లకు నోటీసులు ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు.

వినాయకుని హుండీ ఆదాయం రూ.1.11కోట్లు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.1.11 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. 19 రోజుల హుండీ కానుకలను బుధవారం లెక్కించగా బంగారం 20 గ్రాములు, వెండి 490 గ్రాములు, గోసంరక్షణ ట్రస్టు హుండీ ద్వారా రూ.6 వేలు, విదేశీ కరెన్సీ యూ ఎస్ ఏ 13 డాలర్లు, యూఏఈ దీరమ్స్, ఆస్ట్రేలియా 1,360 డాలర్లుతో కలపి మొత్తం రూ.1.11 కోట్లు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్ బాబు, రవి, రంగస్వామి పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై నేడు, రేపు శిక్షణ

చిత్తూరు కార్పొరేషన్: పల్లెల్లో పన్నుల వసూలుకు అమలు చేయనున్న డిజిటల్ చెల్లింపులపై గురు, శుక్రవారాల్లో పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. మూడు వేల మంది జనాభా ఉన్న పంచాయతీల్లో పీఓఎస్ మిషన్ల ద్వారా, 3 వేల మంది కన్నా తక్కువ జనాభా గల చోట క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులు వసూలు చేయనున్నట్టు తెలిపారు.

ఎస్వీయూలో జాబ్‌మేళా రేపు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మేళాకు మూడు ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు హాజరై సుమారు వంద ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన వారు ఉదయం 10గంటలకు హాజరుకావాలని సూచించారు.

ఆర్టీసీకి బ్రహ్మోత్సవ రాబడి రూ.16.48 కోట్లు

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో ఆర్టీసీకి మొత్తం రూ.16.48 కోట్ల రాబడి వచ్చినట్లు తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్‌లో నిర్వహించిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు 9 రోజులపాటు బస్సు సర్వీసులు నడిపినందుకు రూ.8.22 కోట్లు వచ్చాయని, అక్టోబర్‌లో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ.8.26 కోట్ల రాబడి వచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, ఎంప్లాయీస్ సంఘాల నేతలకు అభినందనలు తెలిపారు. అలాగే ఈ నెల 28, 29 తేదీల్లో పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకు 86 బస్సు సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌తోపాటు వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట, సత్యవేడు, పుత్తూరు డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే అమరావతి, గరుడ, ఇంద్ర ఏసీ సర్వీసులు రెండు చొప్పున నడపనున్నట్లు వివరించారు. ప్రయాణికులు తమ టికెట్లను రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. ఇతర వివరాలకు 9959225684,9959225686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డ్రోన్ సర్వే వేగవంతం



ఊరూరా రెవెన్యూ సమస్యలే.. పొలం గట్టు వద్దో.. స్థలం సరిహద్దు వద్దనో వివాదం. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు.. కుటుంబాలు వీధిన పడి చిన్నాభిన్నం కావడం గ్రామీణ ప్రాంతాల్లో చూస్తుంటాం. పాదయాత్ర సమయంలో ఇలాంటి భూ సమస్యలను గుర్తించి న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాటికి చెక్ పెట్టడానికి భూ రీసర్వేకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డ్రోన్ సర్వే వేగవంతంగా సాగుతోంది.





భూ సర్వే వినతులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్(ఇన్‌సెట్) రీ సర్వేకు వినియోగించే డ్రోన్

- 235 గ్రామాల్లో 3 లక్షల హద్దురాళ్లు ఏర్పాటు
- 82,684 భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి
- వేగంగా రీ సర్వే ప్రక్రియ: జిల్లా కలెక్టర్ షణ్మోహన్

సాక్షి, చిత్తూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం అమలుతో భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో భూములు రీ సర్వే చేస్తుండడంతో రైతులు శాశ్వత ప్రాతిపదికన ప్రయోజనాలు పొందుతున్నారు. గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష (రీ సర్వే) పకడ్బందీగా చేస్తుండడంతో దశాబ్దాల నుంచి వేధిస్తున్న భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. దశలవారీగా చేస్తున్న రీ సర్వే పనుల్లో వేగంగా పురోగతి కనిపిస్తోంది. ఈ ప్రక్రియను కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు.

రీ సర్వేలో సమగ్ర వివరాలు

భూ హక్కు పత్రాల ద్వారా క్యూఆర్ కోడ్, మ్యాపుల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్లతోపాటు ఎల్పీఎం (సరిహద్దు రాళ్లు) నాటి అన్నీ ఉచితంగా రైతులకు అందిస్తోంది. ఇప్పటికే ఈ కార్యక్రమం రెండు దశలు పూర్తి అయ్యింది. ప్రస్తుతం మూడో దశ కార్యక్రమాలను జిల్లాలో మరింత వేగవంతం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 781 గ్రామాల్లో డ్రోన్ సర్వేకు ఏర్పాట్లు చేశారు. అయితే వీటిలో 42 గ్రామాలకు సర్వే అవసరం కాలేదు. మిగిలిన 739 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. 390 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ మ్యాప్‌లు కూడా ఇచ్చారు.

వేగంగా మూడో విడత రీ సర్వే పనులు

మూడవ దశలో 106 గ్రామాల్లో రీ సర్వే పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 18 గ్రామాల్లో పూర్తి చేశారు. ఇంకా 88 గ్రామాల్లో పనులు దశలవారీగా సాగుతున్నాయి. చిత్తూరు డివిజన్‌కు సంబంధించి 31 గ్రామాలు, పలమనేరు డివిజన్‌లో ఆరు గ్రామాలు, నగరి డివిజన్‌లో 17 గ్రామాలు, కుప్పం డివిజన్‌కు సంబంధించి 88 గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్ల (ఎల్‌పిఎం) నాటడం వేగవంతంగా చేస్తున్నారు. ఇప్పటివరకు 82,684 పత్రాలు పంపిణీ చేశారు. ఇందులో 33,874 మందికి సంబంధించి ఈకేవైసీ కూడా పూర్తి చేశారు. మరో 37,824 మంది ఖాతాదారులు, కుటుంబీకులకు ఈకేవైసీ కొనసాగిస్తున్నారు. దశలవారీ రీ-సర్వే పనుల్లో ఇప్పటి వరకు 235 గ్రామాలకు సంబంధించి మొత్తం 3,09,160 లక్షల సర్వే రాళ్లు నాటారు. మొదటి, రెండు దశల్లో 2,52,755 సర్వే రాళ్లు, మూడో దశలో మరో 56,405 సర్వే రాళ్లు నాటారు.



రాళ్లు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



రీ సర్వే యంత్ర పరికరాలు

3.9 లక్షల సర్వే రాళ్లు నాటారు



రీ సర్వే జిల్లాలో వేగంగా సాగుతోంది. రెండు దశల్లో 223 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి, 3.9 లక్షల సరిహద్దు రాళ్లు నాటే ప్రక్రియ పూర్తయింది. 83 వేలకు పైగా భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. క్షేత్రస్థాయి, మండల స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు సంబంధిత రీ సర్వే డీటీలు అక్కడికక్కడే సమస్యలను పరిష్కరిస్తున్నారు.

– షణ్మోహన్ సగిలి, జిల్లా కలెక్టర్, చిత్తూరు

పత్రాలు పంపిణీ చేస్తున్నాం



జిల్లాలో మొదటి దశలో 132, రెండో దశలో 91, మూడో దశలో 106 గ్రామాలకు సంబంధించి రీ సర్వే చేశాం. 223 గ్రామాలకు సంబంధించి సర్వే ప్రక్రియతోపాటు సరిహద్దు రాళ్లు నాటాం. భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నాం. ఇంకా కొంత మేరకు రావాల్సి ఉంది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎప్పటికప్పుడు రీ సర్వేపై పర్యవేక్షిస్తుండడంతో ఈ కార్యక్రమం వేగంగా సాగుతోంది.

– కే.గౌస్ బాషా, జిల్లా సర్వే అధికారి, చిత్తూరు

ఉచితంగానే రీ సర్వే



మా ఊర్లో రీ సర్వే చేశారు. మా పాస్ పుస్తకాల్లో ఉన్న దాని ప్రకారం భూములు చూపించారు. సర్వేచేసి హద్దు రాళ్లు నాటేశారు. భూ హక్కు పత్రాలు ఇచ్చారు. ఈ సమస్యపై గతంలో తహసీల్దార్ కార్యాలయానికి పలు మార్లు తిరిగినా పట్టించుకునేవారు. దీంతో ఆ సమస్యలు అలాగే ఉన్నాయి. ఇప్పుడు రెవెన్యూ వారు మా వద్దకు వచ్చి సర్వే చేసి సమస్యను పరిష్కరించారు.

–కాంతమ్మ వేందుగం పల్లె, కుప్పం మండలం

భూ సమస్యలకు చెక్



మాకున్న పొలాలకు సంబంధించి రికార్డులు హద్దుల కోసం ఇబ్బందులు పడేవాళ్లం. రీ సర్వే ప్రక్రియ మా గ్రామంలో పూర్తయింది. దీంతో ఈ సమస్యలకు చెక్‌పడింది. నా పేరు మీద మొత్తం 5.66 ఎకరాలు ఉండగా 5.37 ఎకరాలు మాత్రమే చూపించారు. ఆ తర్వాత ఫిర్యాదు చేయడంతో రెండోసారి రికార్డుల పరిశీలించారు. ప్రస్తుతం భూ హక్కు పత్రంలో కరెక్ట్ గా వచ్చింది.

–గీత, నెల్లేపల్లి, గంగాధర నెల్లూరు మండలం

భూగర్భ జలాల వృద్ధికి చర్యలు



జలశక్తి అభియాన్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

- కలెక్టర్‌ను కలిసిన జలశక్తి అభియాన్ కమిటీ సభ్యులు
- ఈ నెల 26,27 తేదీల్లో జిల్లాలోని పలు మండలాల్లో పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాల వృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన జలశక్తి అభియాన్ కమిటీ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ సచీంద్రకుమార్ పట్నాయక్, శాస్త్రవేత్త సోమరేంద్రో సింగ్ బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జలశక్తి అభియాన్ పనులు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీటి సంరక్షణ, కుంటలు, చెరువులు పునరుద్ధరణ, గుంతలు, ఫారంపాండ్, అమృత్ సరోవర్, ఫీడర్ చానల్ పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని కమిటీ సభ్యులకు వివరించారు. డ్వామా పీడీ గంగాభవానీ మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఈ నెల 26 వ తేదీన సదుం మండలం తాటిగుంటపాళెం, కంబంవారిపల్లె పంచాయతీల్లో, సోమల మండలంలో నడింపల్లె, ఇరికిపెంట, చౌడేపల్లె మండలంలో అమనిగుంట, నుంజార్లపల్లె, పరికిదొన, గడ్డంవారిపల్లె బంగారుపాళెం మండలంలో పాలేరు గ్రామ పంచాయతీలో పర్యటిస్తారన్నారు. 27వ తేదీన తవణంపల్లె మండలంలోని తవణంపల్లె పంచాయతీ, ఐరాల మండలంలో చినకాంపల్లె, వడ్రాంపల్లె, వీరప్పరెడ్డిగారిచెరువు, మిట్టూరు, కామినేనివారిపల్లె పంచాయతీలలో, యాదమరి మండలంలోని బుడితిరెడ్డిపల్లె, కోనాపల్లె, పెనుమూరు మండలం ఎల్‌కేపీ ఊరు తదితర గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిటీ సభ్యులు పరిశీలిస్తారని తెలిపారు.

27న ఓటర్ల ముసాయిదా విడుదల



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో రాజశేఖర్

- 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఓటర్ల జాబితా ముసాయిదా ఈ నెల 27వ తేదీన విడుదల చేయనున్నట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. వాటిని పరిశీలించి అభ్యంతరాలు తెలియజేవచ్చని తెలిపారు. అలాగే జిల్లాకు కేటాయించిన ఓటింగ్ యంత్రాల తొలిదశ తనిఖీ ప్రశాంత వాతావరణంలో జరుగుతోందన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ ప్రక్రియ నవంబర్ 10వ తేదీ వరకు సాగుతుందని తెలిపారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2,3 తేదీల్లో జిల్లాలోని బీఎల్వోలు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఆ తేదీల్లో మార్పులు, చేర్పులకు అవకాశం చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. అదే తేదీల్లో బీఎల్ఏలు అందుబాటులో ఉండేలా ఆయా పార్టీల ప్రతినిధులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈవీఎంల తొలిదశ తనిఖీ పూర్తి అయిన తర్వాత మాక్‌పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు నిర్వహించిన మార్పులు, చేర్పులు పరిశీలనలోకి తీసుకుని జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా, పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్ కుమార్, శ్రీనివాసులు, గంగరాజు, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- ఖరీదైన వైద్యం ఆరోగ్యశ్రీతో ఉచితం
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

విజయపురం (నగరి): ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం విజయపురం మండలం శ్రీహరిపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు మంత్రి ఆర్కే రోజా, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఈ దేశంలో ఏ ముఖ్యమంత్రికీ రాని ఆలోచన మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిందని, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం పరితపించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు తన తండ్రి కంటే ఒక అడుగు ముందుకు వేసి గ్రామస్థాయి నుంచి ప్రతి ఇంటికీ వైద్య సదుపాయాలను అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నార న్నారు. ఈ క్యాంపుల ద్వారా వైద్యులను ఇంటి వద్దకే పంపి పరీక్షలు చేయించి, చికిత్సలు అందిస్తూ, ఖరీదైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అలాగే సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం చేయిస్తున్నారన్నారు. క్యాన్సర్ ఉన్న వారిని గుర్తించి స్విమ్స్ ఆస్పత్రి పర్యవేక్షణలోని పింక్ బస్సు ద్వారా క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, ఆరోగ్య ఆసరా ద్వారా రూ.1,004 కోట్ల వ్యయం చేసి 16.19 లక్షల మందికి ఆర్థిక భరోసా అందించారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద 35 లక్షల మంది చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం నిమిత్తం రూ.6,687 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రూ.113 కోట్లు ఖర్చు చేసి కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అదనంగా 17 మెడికల్ కళాశాలను తీసుకువచ్చారని, అందులో 5 కళాశాలలను ఇటీవల ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శక పాలన అందించడంలో భాగంగా చిన్నస్థాయి నుంచి మంత్రి స్థాయి వరకు ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.



బీపీ టెస్ట్ చేసుకుంటున్న మంత్రి ఆర్కే రోజా

గ్రామస్థాయి నుంచి వైద్యం

గ్రామ స్థాయి నుంచి ప్రతి పౌరుడు ఆరోగ్యవంతమైన జీవనం గడపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ అన్నారు. నవంబర్ 15వ తేదీ వరకు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, నగరి ఆర్డీఓ సుజన, డీఐఓ రవిరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ వెంకటరాయులు, వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచ్‌లు కుప్పారెడ్డి, శాంతి, జ్యోతి, సౌదామని తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,037 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,563 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.66 కోట్లు ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. భక్తులకు సౌకర్యాల కల్పనను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పకడ్బందీగా ఐఈఆర్పీల ఇంటర్వ్యూలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని భవితా కేంద్రాల్లో ఐఈఆర్పీ (సహిత విద్య రిసోర్స్‌పర్సన్) పోస్టుల భర్తీకి బుధవారం ఇంటర్వ్యూలు పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలాజీకాలనీలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు, నైపుణ్యాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఎంఆర్ పోస్టులకు 53 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 51 మంది అభ్యర్థులు హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. గురువారం హెచ్‌ఐ (వినికిడి లోపం), వీఐ (దృష్టి లోపం) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ ఇంటర్వ్యూల అనంతరం నిబంధనల మేరకు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు సమగ్రశిక్ష శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూల్లో చిత్తూరు డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ, పాఠ్యాంశ నిపుణులు ధనంజయ, విష్ణుకుమారి, సిబ్బంది లావణ్య పాల్గొన్నారు.



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న విద్యాశాఖాధికారులు

శ్రీవారి ప్యాకింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

పూతలపట్టు: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లె జాతీయ రహదారి సమీపంలో బుధవారం నూతనంగా శ్రీవారి ప్యాకింగ్ ఫ్యాక్టరీని అధినేత పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తలపులపలి బాబురెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల అదృశ్యంపై కేసు నమోదు

బైరెడ్డిపల్లె: మండలంలోని టి.గడ్డూరు గ్రామానికి చెందిన రాజేంద్ర భార్య పుష్ప(26) పిల్లలు హేమలత (7), ఉదయ్ (5) బుధవారం మధ్యాహ్నం అదృశ్యం అయ్యారు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఈ విషయమై రాజేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు బైరెడ్డిపల్లె పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వాహనం ఢీకొని జింక మృతి

చిల్లకూరు : జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. ఏఎస్‌ఐ ప్రభాకర్, కానిస్టేబుల్ చిట్టిబాబు ఘటనాస్థలానికి చేరుకుని అటవీ అధికారులకు సమాచారం అందించారు. జింక కళేబరానికి ఫారెస్ట్ అధికారి మురళి అక్కడే పశువైద్యులతో పోస్టుమార్టం చేయించి, చేడిమాల అటవీప్రాంతంలో అంత్యక్రియలు జరిపించారు.

వైఎస్సార్‌సీపీని ఆదరిస్తే అభివృద్ధి పెంచుతాం


ఓఎన్ కొత్తూరులో పసుపు, కుంకుమ, చీర పంపిణీ చేస్తున్న భరత్ సతీమణి దుర్గ

గుడుపల్లి: వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికల్లో ఆదరిస్తే అభివృద్ధి మరింత పెంచుతామని భరత్ సతీమణి దుర్గ పేర్కొన్నారు. బుధవారం ఓఎన్ కొత్తూరు పంచాయతీలోని తలిఅగ్రహారం, చిన్నఅగ్రహారం, పెద్దకొటమాకనపల్లె, చిన్నకొటమాకనపల్లె, కొండసముద్రం, కృష్ణరాజపురం, ఓఎన్ కొత్తూరు గ్రామాల్లోని 850 కుటుంబాలను సందర్శించారు. ప్రతి కుటుంబానికి పసుపు, కుంకుమ, చీర అందజేసి, పార్టీని ఆదరించాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందించేలా నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమ చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, పల్లెలను అభివృద్ధి పథంలో పయనింజేస్తామని ఆమె హామీ ఇచ్చారు. భరత్ స్థానికంగానే కుప్పంలోనే ఉంటారని చెప్పారు. ప్రతి సమస్యకు సంబంధించి ఒక ఫోన్ కాల్ చేస్తే, సమాధానం చెప్పి ఆదుకుంటారన్నారు. మీకు అందుబాటు లో ఉండి మీ బిడ్డగా ఉంటారని ఎమ్మెల్సీ సతీమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్‌లు రామమూర్తి, దేవప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్సంబంధాలతోనే మనుగడ


మాట్లాడుతున్న రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీవీఎస్ఆర్ మూర్తి

పలమనేరు: పోస్టాఫీసుకొచ్చే జనంతో మమేకమై వారితో సత్సంబంధాలు కొనసాగిస్తేనే భవిష్యత్తులో పోస్టాఫీసుల మనుగడ ఉంటుందని కర్నూలు రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీవీఎస్ఆర్ మూర్తి అన్నారు. పట్టణంలోని పోస్టాఫీసును బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఇక్కడి లావాదేవీలు, ఖాతాలు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసంటే ఏదో ఉత్తరాలు వచ్చాయా? వాటిని బట్వాడా చేశామా? అంటే కుదరదన్నారు. పోస్టాఫీసు సేవలను ప్రజలకు వివరించి వారిని మన వద్దకొచ్చేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కొందరు ఉద్యోగులు ఆఫీసులో కూర్చొని ప్రజలతో మాట్లాడేందుకు సైతం ఇష్టపడకుండా విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే పోస్టాఫీసుల మనుగడ ఆగమ్యగోచరంలా మారి మన ఉద్యోగాలు పోయే అవకాశం లేకపోలేదన్నారు. ఆధార్ సేవలు ప్రజలకు చాలా అవసరమని, ఈ క్రమంలో ఆ సేవల కోసం పోస్టాఫీసులకు వచ్చే వారికి ఉత్తమ సేవలు అందించాలన్నారు. ఆడపిల్లల కోసం అమలులో ఉన్న సుకన్య సమృద్ధి యోజనపై జనానికి అవగాహన లేక చాలామంది దాన్ని పట్టించుకోవడం లేదన్నారు. బ్యాంకుల కంటే పోస్టాఫీసుల్లో ఎక్కువ వడ్డీ ఇస్తున్నా జనం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. మహిళలకు లబ్ధి చేకూరే ఎన్నో పథకాలు మన వద్ద ఉన్నాయన్నారు. పోస్టల్ బీమాపై కూడా ప్రజలకు అవగాహన లేదన్నారు. దీనికి కారణం మనశాఖలోని ఉద్యోగులేనన్నారు. ఇకనైనా ఖాతాదారులు, సేవల కోసం వచ్చే ప్రజలను మర్యాదగా పలకరించి వారి సమస్యలను పరిష్కరిస్తూనే మన సేవలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన వెంట జిల్లా పోస్టల్ సూపరిండెంటెంట్ లక్ష్మణ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సబ్‌పోస్ట్‌మాస్టర్ సునంద సిబ్బంది పాల్గొన్నారు.

వడ్రంగి దుకాణంలో అగ్ని ప్రమాదం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రంలో ఓ వడ్రంగి దుకాణంలో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.25 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం గ్రామంలో పాలసముద్రం మండలం ఆముదాల పుత్తూరు గ్రామానికి చెందిన అరుణాచలం ఆచ్చారి, రవి ఆచ్చారి, రజని ఆచ్చారి వడ్రంగి దుకాణం నడుపుతూ కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున దుకాణంలో ఉన్నట్లుండి మంటలు రేగాయి. ఈ విషయం గుర్తించిన స్థానికులు, దుకాణ యజమానులు, చిత్తూరు అగ్నిమాపక కేంద్రం అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపకం అధికారులు వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే దుకాణంలోని తలుపులు, కిటికీలు, టేబుళ్ల తయారీకి ఉపయోగించే చెక్కలు, యంత్రాలు కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.25 లక్షలకు పైగా నష్టం వాటిలిందని బాధితులు పేర్కొన్నారు. సమాచారమందుకున్న చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఇన్‌చార్జి సీఐ రవి, గంగాధర నెల్లూరు ఎస్‌ఐ రామాంజనేయులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో పాడిరైతుల ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జగనన్న పాల వెల్లువ పథకం రెండో విడతలో 11 మండలాల్లోని గ్రామాల్లో పాడి రైతుల ఇంటింటి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేని పకడ్బందీగా పూర్తి చేసేలా తహసీల్దార్, ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూథింగ్ సర్వే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, గంగవరం, వి.కోట, గుడుపల్లె మండలాల్లో వచ్చే సోమవారం లోపు పనులు పూర్తి చేయాలన్నారు. సర్వే పూర్తి అయిన మండలాల్లో సర్వేయర్లను పెండింగ్ మండలాలకు పంపి పనులు పూర్తి చేయించాలని చెప్పారు. సర్వే రాళ్ల నాటే ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, రీ సర్వే పూర్తి అయిన పట్టా భూములకు సంబంధించి వీఆర్వో లాగిన్ నుంచి వచ్చే దరఖాస్తులను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించి ఆర్డీఓకు పంపాలన్నారు. 22 ఏ కసరత్తులో పూర్తి అయిన నివేదికలను కలెక్టరేట్‌కు పంపించాలని తెలిపారు. అసైన్‌మెంట్ భూ పట్టాల పంపిణీలో టెక్నికల్ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. నివేదికల్లో అనర్హులు ఉంటే తహసీల్దార్‌పై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జగనన్నకు చెబుదాం అర్జీలు పకడ్బందీగా పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం


వేడుకలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్


దేవదేవేరుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాపూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం పెనుశిల శ్రీలక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి కల్యాణం నిర్వహించారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో దేవదేవేరుల కల్యాణం జరిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సంకల్పించారు. ఈ మేరకు తొలుత రాపూరులో స్వామి, అమ్మవార్ల వివాహ వేడుకను కమనీయంగా నిర్వహించారు. శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపంలో ఉత్సవర్లను కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, పార్టీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎంఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, ఈఓ జనార్దన్‌రెడ్డి ,పెంచలకోన ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, మల్లికార్జునస్వామి, వినోద్‌స్వామి,సూర్యస్వామి, నాగరాజస్వామి, ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూలు విడుదల

- నేటి నుంచి నవంబర్ 6 వరకు జిల్లాస్థాయి సెలెక్షన్స్

నగరి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి క్రీడా ఎంపికలకు సంబంధించిన క్రీడల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మైదానాలు వేదికగా గురువారం నుంచి నవంబర్ 6వ తేదీ వరకు అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. సెలెక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీ, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
26-10-2023	బాల్ బాడ్మింటన్	జెడ్పీహెచ్‌ఎస్ మునగలపాళెం, ఏర్పేడు
	సాఫ్ట్‌బాల్	ఎస్ఆర్‌ఎస్‌జీహెచ్, పుత్తూరు
27-10-2023	ఫుట్‌బాల్	జీడీసీ మైదానం, పలమనేరు
	చెస్	ఎస్‌పిజేఎన్‌ఎం హైస్కూలు, తిరుపతి
28-10-2023	టెన్నికాయిట్	జెడ్పీహెచ్‌ఎస్, చిలమాకులపల్లె, ఎస్ఆర్‌పురం
	జిమ్నాస్టిక్స్	జెడ్పీహెచ్‌ఎస్, ఏర్పేడు
30-10-2023	బేస్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, మంగళం ట్రెండ్స్
	వాలీబాల్	జెడ్పీహెచ్‌ఎస్, నెల్లేపల్లి, జీడీ నెల్లూరు.
02-11-2023	క్రికెట్	జీఎంఎస్‌సీఎస్ స్టేడియం, వాల్మీకిపురం
	సెపెక్‌తక్రా	జెడ్పీహెచ్‌ఎస్(బాయ్స్) రేణిగుంట
03-11-2023	సాఫ్ట్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, పూతలపట్టు
03-11-2023	మోడర్న్ పెంటాథలాన్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
03-11-2023	రోప్ స్కిప్పింగ్	జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె
04-11-2023	అథ్లెటిక్స్	తుమ్మలగుంట స్టేడియం, తిరుపతి
06-11-2023	రగ్బీ	జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ

నేర నియంత్రణకే విజిబుల్ పోలీసింగ్


డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

రేణిగుంట : నేర నియంత్రణకే విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును సమీక్షించి, జనరల్, కేసు డైరీలు తదితర రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుపతికి మహాద్వారం వంటి రేణిగుంటలో అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక బొంతాలమ్మ గుడి, రమణవిలాస్ కూడళ్లపై నిరంతర నిఘా ఉంచాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టి ఎర్రచందనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణకు చెక్ పెట్టాలని సూచించారు. పాత నేరాగాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరారు. స్టేషన్ వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా పోలీసు వ్యవస్థ ఔన్నత్యాన్ని పెంచేలా వ్యవహరించాలని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరును సమీక్షించాలని చెప్పారు. ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. పెండింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ భవ్యకిషోర్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్ స్పెషల్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐలు చంద్రశేఖర్ పిళ్లై, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రెండు జేసీబీలు.. ఒక టిప్పర్ సీజ్


అక్రమంగా తవ్విన ఖనిజాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసకుమార్

సైదాపురం : మండలంలోని గద్దలదిప్ప వద్ద బుధవారం అక్రమంగా తవ్వకాలు చేస్తున్న రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను జిల్లా మైనింగ్‌శాఖ అధికారి శ్రీనివాసకుమార్ సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా దాడులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని పెరుమాళ్లపాడు, అనంతమడుగు, లింగసముద్రం, తొకలపూడి, తిప్పిరెడ్డిపల్లె, చాగణం, రాజుపాళెం గ్రామాల వద్ద కూడా అక్రమ తవ్వకాలు సాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ప్రభుత్వం అనుమతి పొందిన లీజుదారులు మాత్రమే మైనింగ్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం లింగసముద్రం గ్రామానికి వెళ్లే మార్గంలో అక్రమ తవ్వకాలు చేసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

వేర్వేరు చోట్ల గంజాయి పట్టివేత


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గూడూరురూరల్ : సూళ్లూరుపేట, గూడూరు ఎస్‌ఈబీ పరిధిలో వేర్వేరు చోట్ల బుధవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.4.80లక్షల విలువైన 24 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఏఎస్పీ రాజేంద్ర తెలిపారు. గూడూరు ఎస్‌ఈబీ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సూళ్లూరుపేట బస్టాండ్ వద్ద చేపట్టిన తనిఖీల్లో చెన్నై ప్రాంతానికి చెందిన భూపతి, ప్రేమ్‌నాథ్ అనే ఇద్దరి వద్ద 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో నిందితుడు కార్తీక్ అలియాస్ వెంకటేష్‌ను త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు చెప్పారు. అలాగే గూడూరు పరిధిలో చేపట్టిన దాడుల్లో గాంధీనగర్‌కు చెందిన కె.వెంకటేష్, రమణమ్మ, లింగారెడ్డిపల్లెకు చెందిన వంశీని అదుపులోకి తసీఉకుని 4 కేజీల గంజాయి, పల్సర్ బైక్, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంజాయి రవాణాతో సంబంధం ఉన్న ఒంగోలుకు చెందిన కాపా శ్రీనివాసరెడ్డిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. దాడుల్లో పాల్గొన్న ఎస్‌ఈబీ సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది పోలయ్య, రమణయ్య, గౌస్‌బాషా, రామ్‌ప్రసాద్, రమేష్, ఆనంద్‌ను అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సైదాపురం : మండల కేంద్రానికి సమీపంలోని కైవల్యానది వంతెన సమీపంలో బుధవారం రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. గేర్ రాడ్ విరిగిపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సు నిలిపేశాడు. దీంతో బస్సులోని సుమారు 50 మంది ప్రయాణికులకు ముప్పు తప్పింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఓజిలి: మండలంలోని చిలమానుచేను పాత ఐజేఎం ప్లాంటు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముంతల పద్మ(35) అనే మహిళ మృతి చెందింది. వివరాలు చిలమానుచేనుకు చెందిన పద్మ గూడూరు ఉపాధి హామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో విధులు ముగించుకుని స్కూటీలో ఇంటికి వస్తుండగా అదుపు తప్పి పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాటేసిన ‘కట్టల’ పాము

కరెన్సీ కట్టల వాసనతో మత్తెక్కిన ఆ టీచర్ మానవత్వం మరిచాడు. ఆర్థిక అవసరాలకు తనని ఆశ్రయించిన ఓ పేద రైతు పొలం తన పేర రాసుకున్నాడు. తీసుకున్న నగదు వడ్డీతో కలిపి తిరిగి ఇస్తానన్నా ఆ పొలం తిరిగి ఇవ్వడానికి అంగీకరించకుండా ఆ అన్నదాత ప్రాణాలు బలితీసుకున్నాడు.

- టీచర్ వడ్డీ వ్యాపారానికి రైతు బలి
- తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ చంద్రప్ప మృతి


మృతుడు చంద్రప్ప (ఫైల్)

పలమనేరు: టీచర్ వడ్డీ వ్యాపారానికి ఓ రైతు బలయ్యాడు. తన భూమిని తిరిగి రాసివ్వమని అడిగితే కాదన్నందుకు మనస్తాపానికి గురైన ఓ సన్నకారు రైతు వడ్డీ వ్యాపారి ఇంటిముందే క్రిమిసంహారక మందును తాగి, అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అనంతరం తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. బైరెడ్డిపల్లె మండలం మిట్టకురప్పల్లెకు చెందిన చంద్రప్ప(33) గ్రామంలో తన 53 సెంట్ల పొలంలో సేద్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. ఇలా ఉండగా మూడేళ్ల క్రితం చంద్రప్ప భార్య అనారోగ్యం పాలవ్వడంతో వారి బంధువైన ప్రభుత్వ టీచర్ కృష్ణమూర్తి వద్ద తన పొలాన్ని రాసిచ్చి రూ.2 లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ఆపై తీసుకున్న అప్పు వడ్డీతో కలసి రూ.4 లక్షల వరకు అయింది. ఆ మొత్తం చెల్లిస్తే తిరిగి భూమి వెనక్కి రాసిస్తానని టీచర్ చెప్పాడు. దీంతో బాధితుడు రెండేళ్లుగా డబ్బు కడతానంటూ టీచర్ వద్ద కెళ్లినా ఆయన పట్టించుకోలేదు. దీంతో సోమవారం సాయంత్రం బైరెడ్డిపల్లెలో క్రిమిసంహారమందు తీసుకుని గంగవరంలోని సాయినగర్‌లోని టీచర్ ఇంటి వద్ద కెళ్లి మీరు చెప్పినట్టే వడ్డీతో కలపి మొత్తం డబ్బు చెల్లిస్తానని తన భూమి తనకు రిజిస్టర్ చేసివ్వాలని ప్రాధేయపడ్డాడు. ససేమిరా కాదని ఆ ఉపాధ్యాయుడు చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితుడు ఆ టీచర్ ఇంటి ముందే తన వెంట తెచ్చుకున్న క్రిమిసంహారకమందును తాగి, అక్కడే అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు 108లో అతన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అతని పరిస్థితి విషమించడంతో వైద్యులు తిరుపతి రుయాకు సిఫార్సు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ చంద్రప్ప బుధవారం మృతి చెందాడు.